
ఈ వారం తెలుగు పుస్తకం

# 'అమ్మ'కి ఆదివారం లేదా?

## (50 కథలు ఒకే సంపుటంగా)

పి. రామకృష్ణ




Title: Ammaki Adivaram leda?
Author: Ranganaayakamma
Subject: SHORT STORIES
Year of Publication: 2005
Price: USD $ 3.47

*తన యాభైఏళ్ల రచనా జీవితం నుంచి యాభై కథల్ని ఎంపిక చేసి, రంగనాయకమ్మ ప్రచురించిన భారీ కథా సంపుటం ఇది. కథల సంఖ్య రీత్యానే దీన్ని భారీ కథా సంపుటం అనడంలేదు. పుస్తకం సైజురీత్యా కూడా భారీగా వుండటం వల్లనే ఇలా అనడం. తన కథలన్నింటినీ ఒకే పుస్తకం ద్వారా అందించడానికీ, పుస్తకం ధర పాఠకులకు అందుబాటులో వుండడానికీ, తన కిష్టం లేకపోయినా ఈ సైజులో, అంటే, రాయల్ సైజులో ప్రచురించవలసి వచ్చిందని ఆమె వివరించారు. పుస్తకం సైజు అసాధారణంగా వుండటమే కాక, ముఖచిత్రం కూడా... ఏ పాఠ్యపుస్తకాలకో, సైన్స్ గ్రంథాలకో వున్నట్టు అసాధారణంగానే వుంది. ఇటువంటి అసాధారణ సాహసాలు చేయగల అవకాశం ఒక్క రంగనాయకమ్మకు తప్ప, మరే ఇతర రచయితలకూ, ప్రచురణకర్తలకూ లేదు.*

దాదాపు 20కి పైగా కథల్ని ప్రచురణకు తేకుండా త్యజించినట్టు చెబుతూ, అందుకుగల కారణాలను వివరించారు *రంగనాయకమ్మ*. అంతేకాదు, ఇంకా ఇలా అన్నారు "ఈ కథలు బాగాలేవు అనడం అంటే, రీప్రింటులో వున్న కథలు గొప్పగా వున్నాయని చెబుతున్నట్టు కాదు".

"కథల్లోనూ, నవలల్లోనూ కూడా 'అబ్బా, ఎంత తుక్కు రాశానో అనిపించిన సందర్భాలు బోలెడు వున్నాయి. అలాంటి సందర్భాల్లో నేను నాకు నచ్చను. కానీ, ఆశ్చర్యం ఏమిటంటే ఈ పిచ్చికథలకీ కాస్తో కూస్తో పేరువచ్చింది. పాఠకుల అమాయకత్వం మీదా, అజ్ఞానం మీదా ఆధారపడ్డ పేరు అది" - ఒక రచయిత తన రచనల్ని గురించి ఇంత నిర్మమకారంగా, నిజాయితీగా చెబుతుంటే, దాన్ని కూడా 'అసాధారణం' అనే అనాలి.

ఆ విధంగా, తన పిచ్చికథలకే పేరు వచ్చినందుకు *రంగనాయకమ్మ* ఆశ్చర్య పడుతున్నారు కానీ, ఆమె ఇప్పటికీ అటువంటి కథలు రాసుకుంటూ వుంటే బావుండేదని భావించేవాళ్లూ వున్నారు. ఇలా భావించే వాళ్ళలో మళ్లీ రెండు రకాల వారున్నారు. ఆమే అన్నట్టు అందులో అమాయక పాఠకులొక రకమైతే, అసూయా పరులైన పాఠకులింకోరకం. ఈ రెండో రకం కేవలం పాఠకులు మాత్రమే కాదు, రచయితలుగా, విమర్శకులుగా ఎ'దిగి'న వాళ్ళు. *రంగనాయకమ్మను* మహిళా రచయితగా గుర్తించకపోవడమే ఇందుకుదాహరణ. అలాగని మహిళా పరిధిని దాటిన రచయితగా

గుర్తిస్తున్నారా అంటే, అందుకూ 'మేధావులు' అడ్డుపడుతూనే వున్నారు. ఈ దురభిమాన, నిరభిమానుల్లో ఎవరివైపూ చేరకుండా, ఈ సంపుటంలోని కొన్ని కథల్ని గుణాత్మకంగా సమీక్షించడం సాధ్యమవుతుందేమో... చూద్దాం.

'అమ్మకు ఆదివారం లేదా'? అన్నది ఈ పుస్తకంలో 'టైటిల్ స్టోరీ'యే కాక మొట్టమొదటిది. బహుశా పెద్దది కూడా కావచ్చు. గృహిణులకు వారంలో ఒకరోజు సెలవు వుండాలంటూ రాజ్య సభలో జరిగిన చర్చ దీని వస్తువు. ఒక నక్సలైట్ రాసాడని విన్న కరపత్రం శీర్షికనే ఈ కథకు తీసుకున్నట్టు *రంగనాయకమ్మ* చెప్పారు. ఈ కథని ఆద్యంతమూ ఎంతో ఉత్సాహంగా, ఆహ్లాదకరంగా నడిపించారు. కథ అంతా *రంగనాయకమ్మ* వ్యంగ్యంతోనూ, వ్యాఖ్యలతోనూ నిండివుందని 'మహాశిల్పు'లైన విమర్శకులు ఆక్షేపించవచ్చునేమో కానీ, పాఠకులు హాయిగా, అంటే, ఆలోచనా రహితంగా అని కాదు. ఆసక్తితో చదువుకుంటారు. చాలా సందర్భాల్లో నవ్వకుండా ఈ కథ చదవడం ఎవరికీ సాధ్యంకాదని, నమ్మకంగా చెప్పవచ్చు.

"ఇంకా తెల్లారలేదు కానీ, తెల్లారగట్ల వెన్నెలతో తెల్లారినట్లే వుంది. అప్పుడే ఏం చెద్దామనో, అన్నపూర్ణమ్మగారి వాకిట్లో చెట్లమీద పిట్టలన్నీ లేచేశాయి. లేచేసి దేని రెక్కలతో అది గంతులూ, దేని కంఠంతో అది కూతలూ మొదలుపెట్టేశాయి". పిట్టలు దేని రెక్కలతో అది గంతులూ, దేని కంఠంతో అది కూతలూ వేస్తూంటే, మనుషుల్లో మగవాళ్లు తమకు చేతులూ, కాళ్ళూ లేనట్టు ఆడవాళ్ళ చాకిరీ మీద ఆధారపడి బతుకుతున్నారని, సూచించడం కాదంటారా? కాదంటే, ఇది చూడండి.

"ఇంకా అరవైఏడేళ్ళయినా నిండని జగన్నాథం 'పెద్దవాడినై పోలేదూ'' అని రోజూ తనని తాను అపార్థాలు చేసుకుంటూ, ఎప్పుడూ దగ్గుకుంటూ వుంటాడు. "ఇంతకన్నా ఏం చెయ్యను?" అన్నట్టు. ఏం చేసేదేమిటి? అన్నపూర్ణమ్మతో కలిసి ఆ గిన్నెలన్నీ తోముకోకూడదూ?" ఇప్పుడు 'అరవై ఏడేళ్ళు నిండని' జగన్నాథంనీ ఆయన దగ్గునీ ఆక్షేపించి ఆటపట్టించినప్పుడు, ఏ దగ్గులూ, తుమ్ములూలేని యువకులైన ప్రసాద్, వాసులను క్షమిస్తారా *రంగనాయకమ్మ?* ఆ యువకుల యువభార్యలు అరుణ, కమలలు ఉదారంగా వుండి సెలవురోజు కూడా చాకిరీ చేసి, పాతవడిన పాతివ్రత్యానికి మెరుగులు పెడతారా? పెట్టరు... పెట్టరు, అదే కాదు, గుమ్మం దగ్గర పడివున్న పాలప్యాకెట్లను కూడా ఇంట్లోకి తెచ్చిపెట్టరు. పోనీ, అత్త అన్నపూర్ణమ్మో, ఆడబిడ్డ రేఖో తెస్తామంటే, ఒప్పుకుంటారా? ఒప్పుకోరు. వాళ్ళు మాత్రం ఆడవాళ్లు కాదా? వాళ్లకు సెలవక్కర్లేదా? ఆడవాళ్లిలా మగవాళ్ళ మీద అనవసరపు దయ చూపబట్టే కదా, మగవాళ్లు వారానికోరోజైనా సెలవివ్వకుండా, ఆడవాళ్లను వేపుకు తింటున్నది?

ప్రసాద్, వాసుల తమ్ముడు వేణు మాత్రం వేరు, అన్నలలాంటి వాడు కాదు. అందుకే వదినెలిద్దరికీ అతనంటే అభిమానం. ఆడవాళ్ల సెలవు రోజున వంటచెయ్యడానికి అతను సిద్ధమే కానీ "ఆ ఇద్దరు పెద్ద మగమహారాజులకేమయింది? వాళ్ళు ఎందుకు వంట చెయ్యరు?" ఇదీ వదినెల వాదన. పెళ్ళిళ్ళకు వంటలు చేసే హనుమంతు కూడా సొంతభార్యకోపూట వంట చేసిపెట్టడానికి ఒప్పుకోడు. భార్యల తిరుగుబాటును భరించలేని భర్తలు వంట పని తప్పించుకోవడానికి ఎన్నో ఎత్తులు వేస్తారు. ఆ ఎత్తుల్ని చిత్తు చేసినా, ఒక ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతారు ఆడవాళ్ళు. "మేం బైటపని చేస్తున్నాం (ఉద్యోగాలు వెలగపెడుతున్నాం). మీరు ఇంటిపని చేస్తున్నారు. సరిపోయింది. ఇక మేం ఇంటి పనెందుకు చెయ్యాలి?" ఇది మగ ప్రశ్న. పనిగంటల ఆరాతీసినా దీనికి సరైన జవాబు దొరకలేదు. పరిష్కారం ఒక్కటే, ఆడవాళ్లూ మగవాళ్ళూ కలసి ఇంటిపని చేసుకోవడం.

తనకు మార్క్సిజం తెలీకపోతే, ఈ పరిష్కారాన్ని సూచించడం తెలిసేది కాదంటున్నారు *రంగనాయకమ్మ.* సమాజంలో వర్గాల మధ్య వ్యత్యాసం తగ్గడానికి బౌద్ధిక శ్రమకూ, శారీరక శ్రమకూ మధ్య వున్న అంతరం పోవాలంటుంది మార్క్సిజం, ఎలా పోతుంది? బౌద్ధిక శ్రమ చేసేవాళ్ళు శారీరక శ్రమ, శారీరక శ్రమ చేసేవాళ్ళు బౌద్ధిక శ్రమ కూడా చేసే వ్యవస్థ ఏర్పడితే వర్గాల మధ్య ఈ వ్యత్యాసం తగ్గుతుంది... అంటుంది మార్క్సిజం. కొన్ని సమస్యలు ఎదురయ్యే మాట నిజమే

అయినా (చైనాలో జరిగిన 'కల్చరల్ రివల్యూషనూ" పోల్‌పాట్ ఆధ్వర్యంలోని కంపూచియా... ఇందుకు ఉదాహరణలు) ఇంతకుమించిన మార్గం లేదు. ఇంటిపని విషయంలో కూడా ఇదే పరిష్కారం. ఆడవాళ్ళకు చాకిరీ, మగవాళ్ళకు సౌకర్యమూ వుండే పరిస్థితి మారాలంటే, ఇదే పరిష్కారం. మార్క్సిజం తెలిసినా, ఈ విషయం తెలియనట్టు వుండే మగవాళ్లే సమాజం నిండా వున్నారన్నా, మార్క్సిజం తెలియకపోయినా ఇంటిపనిలో భార్యలకు తోడ్పడే భర్తలున్నారన్నా, వేరే విషయం. వ్యక్తిగత సంస్కారంవల్లనో, అవసరం రీత్యానో చెయ్యడం కాక, సామాజిక మార్పుకు చెయ్యవలసిన పని గురించి చెబుతుంది మార్క్సిజం.

చట్టం ద్వారా ఇంటి చాకిరీ చేసే గృహిణులకు వారానికోరోజు సెలవు ఇవ్వాలనుకోవడం అసంబద్ధమైన, హాస్యాస్పదమైన విషయం. అందుకే, *రంగనాయకమ్మ* ఈ కథ ఆసాంతం హాస్యధోరణితో చెప్పారు. మధ్య మధ్యలో ఫోన్ ద్వారా గవర్నమెంటు గారిని సంప్రదించడం మరింత బావుంది. తద్వారా గవర్నమెంటు గారు 'బఫూన్'గా కనిపించారు. ఇంతకూ, అమ్మకు ఆదివారం వుండటం హక్కు,న్యాయమూ కూడా. అయితే, లేకపోవడం వాస్తవం. అందుకే చిన్నిగాడు, "అమ్మకు ఆదివారం ఉందంటా, లేదంటా" అన్నది.

ఈ సంకలనంలో రెండో కథ *'సంస్కరణ'*. ఇందిరా, శ్రీహరి దంపతులిద్దరూ డాక్టర్లు. వాళ్ళ అనుభవంలోని సంఘటనను కథగా చెప్పానన్నారు రచయిత్రి. పధ్నాలుగేళ్లు కూడా లేని సీతను, అరవైఏళ్ళు దాటిన రాజయ్యకిచ్చిపెళ్ళి చేయనున్నారని, ఇందిర స్నేహితురాలు సుశీల చెప్పిన వార్త, భార్యా భర్తలిద్దరికీ బాధ కలిగించింది. బాధపడి ఊరికే ఉండలేక, ఆ పెళ్ళి తప్పించే మార్గం దొరుకుతుందేమోనని, సీత వున్న ఊరిలోనే వున్న సుశీల ఇంటికి వెళ్తారు. అక్కడ, సుశీలతో కలిసి అక్క సంరక్షణలో వున్న సీతదగ్గరికి వెళ్తారు. సీత అక్క జయమ్మ కూడా పేదరికంతో, పిల్లలతో సంసారం ఈదుతోంది. తల్లి చనిపోయి, తాగుబోతు తండ్రి పట్టించుకోకపోతే, చెల్లెల్ని తన దగ్గర ఉంచుకుంది. సీతను రాజయ్యకిచ్చి పెళ్ళి చేస్తే, వున్నవాడు కనుక తన కుటుంబాన్నీ ఆదుకోవచ్చని జయమ్మ ఊహ, అందువల్ల, శ్రీహరి, ఇందిరలిచ్చిన సలహాను, జయమ్మా, ఆమె భర్తా అంగీకరించరు. ఏమైతే అది అవుతుందని తెగించి, సీత అంగీకారంతో ఆ ఇద్దరూ సీతను తీసుకుని తమ ఇంటికివస్తారు.

ఆశ్చర్యకరంగా, పెళ్ళి రోజు క్కూడా సీత కుటుంబంవాళ్ళెవ్వరూ సీత కోసం రారు. తీరా తెలిసిందేమిటంటే, సీత కంటే చిన్నదైన జయమ్మ కూతురు సావిత్రినిచ్చి, ఆ ముహూర్తానికే పెళ్ళి చేసారని. సీతను కాపాడాలని చూస్తే అంతకంటే దారుణం జరిగిపోయిందే అన్నది, శ్రీహరి ఇందిరల ఆవేదన. శ్రీహరి, ఇందిరలిద్దరూ మంచి మనుషులు. ఎదుటి వాళ్ళ కష్టాలకు హృదయ స్పందన కోల్పోని డాక్టర్లు. సమాజంలో జరిగే అన్యాయాలను ఎదుర్కోవాలకునే సంస్కరణ వాదులు. అయితే ఏమయింది? సీత పెళ్ళి సావిత్రికి 'చావు' లాంటిదయింది.

మంచివాళ్ళ వల్ల కొన్ని సందర్భాల్లో మంచే జరిగినా, అన్ని సందర్భాల్లోనూ అలాగే జరగదు. అలాగే, సంస్కరణలవల్ల కూడా అన్ని సందర్భాల్లో మంచే జరగదు. ఇది చెప్పడానికేనా *రంగనాయకమ్మ* ఈ కథ రాసింది? కాదు. సమాజంలో అసమానతలువున్నంతవరకూ, సంస్కరణలవల్ల ఆట్టే ప్రయోజనముండదనడానికి ఆమె రాశారు. అందుకే ఆ కథకు *'సంస్కరణ'* అని పేరు పెట్టారు. అందుకే, ఇందిరా, శ్రీహరీ ఘోరమైన తప్పు చేసినట్టు కుమిలిపోయింది.

అయితే, *'సంస్కరణ'*... పోనీ ఈ మాట అనొద్దు. ఇందిరా, శ్రీహరీ చేసింది తప్పా? జయమ్మకు సీతకంటే చిన్నదైన కూతురు లేకపోయివుంటే, వాళ్ళ చర్య సత్ఫలితాన్నిచ్చేదే కదా? అప్పుడు జయమ్మకాక, సుబ్బమ్మ తన కూతుర్ని రాజయ్యకిచ్చేదేమో! అలాగైనా, సీతను తప్పించినట్టే కదా! అందువల్ల, సంస్కరణవల్ల ఫలితం పరిమితమనే సూచనతోకాక, "అబ్బ! ఏం పని చేశాం" అని పించేంత మోతాదులో వుండటం సబబేనా... అనిపిస్తుంది.

'తలలు పుచ్చిన మనుషులు" కథలో, 'జానకి విముక్తి' నవల్లోని సత్యం వున్నాడు. ఈ పాత్రకు సత్యంలాంటివాడే కావాలనుకున్నారేమో! ఇంకోటి కూడా వుందిలెండి. ఎందరికో తెలిసి, ఇంకాజ్ఞాపకం వున్న సత్యం ఈ కథలో కనిపిస్తే, 'వాస్తవికత' వస్తుంది కథకు. "అరె, ఆ సత్యమేనా?" అని, ఇంకొంచెం శ్రద్ధగా చదువుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న సత్యానికి ఒక ముసలాయన తారసపడతాడు. తారసపడటమంటే సత్యానికి ఎదురుగా వచ్చాడని కాదు. సత్యం సీట్లో కూచొని దర్శనమిచ్చాడన్నమాట. మాటల మధ్యలో ఆ ముసలాయన మామూలు ముసలాయన కాదని తెలిసింది. ఇంగ్లీష్ లెక్చరర్‌గా రిటైరయిన శర్మగారనీ, ఆయనకు విజయవాడలో స్వంత ఇల్లు వుందనీ, అమెరికాలో ఇంజనీర్‌గా స్వంత కొడుకూ, హైదరాబాద్ ఆఫీసర్స్ కాలనీలో స్వంత కూతురూ వున్నారని తెలిసింది. వాటితో పాటు ఆయన స్వంత కుడి చేతివ్రేళ్ళకు ఖరీదైన రెండు బంగారు ఉంగరాలున్నాయనీ, ఆయన స్వంతవొంటి మీద జ్వరం వుందనీ, సత్యం గమనించాడు.

"ఇలాంటి వాడికి, మాసిన బట్టల్తో, జ్వరంతో రావలసిన దుస్థితి ఎందుకొచ్చినట్టు" అని సత్యం ఆలోచిస్తుండగానే, రైలు పెట్టెలో వున్న వాళ్ళందర్నీ పెద్ద దుస్థితిలో పడవేస్తూ, ఆ ఉంగరాల ముసలాయన భళ్ళున 'విరోచనం' చేసుకున్నాడు.

రైలు పెట్టెలోవున్న వాళ్ళెవరూ ఆయనదగ్గరికి వెళ్ళలేకపోతే, సత్యం ఆ కాలుష్యాన్నీ, కాలుష్య కారుడినీ శుభ్రం చేసి, అవసరమైతే ఇంకా సేవకు సిద్ధంగా వుంటాడు. సెన్సిటివ్ పాఠకులు అప్పటికే ముఖం చిట్లించుకుంటున్నా లెక్క చెయ్యకుండా *రంగనాయకమ్మ* ఆ సందర్భాన్నంతా చాలా వివరంగా చెప్పారు. ఆ విధంగా సేవ చేసిన సత్యం విజయవాడలో ఆయన్ని ఇంటికి పంపించడంలో కూడా సహాయపడి, ఆ తర్వాత తన దారిన వెళ్తాడు. 'తన దారిన' అంటే, తన స్వంత పని మీద అని కాదు, యాక్సిడెంటులో గాయపడిన మిత్రునికి సహాయం చేసే పనిమీదనే.

హైదరాబాద్‌లో ఒక సారి అనుకోకుండానే సత్యం ఆఫీసర్స్ కాలనీలో వున్న శర్మ కూతురు ఇంటకివెళ్తాడు. ఆమెకు డబ్బుమీదా, అదిచ్చే హోదామీదా, గొప్పలు చెప్పకోవడం మీదా తప్పించి, తండ్రిమీద కానీ, మరెవరిమీద కానీ ఎటువంటి ప్రేమా లేదని గ్రహిస్తాడు. సత్యం ఇంకోసారి విజయవాడ వచ్చినప్పుడు, ఆ శర్మ ఎలా వున్నాడో చూద్దామని... ఆయనింటికి వెళ్తాడు. ఆశ్చర్యం. ఆ రైలు శర్మకీ, ఈ శర్మకీ పోలికేలేదు. 'ఎర్రగా పండులా మెరిసిపోతున్నాడు'. అదంతా వంటమనిషి నాగమ్మ సేవ వల్ల లభించిన ఆరోగ్యం. అటువంటి ఆరోగ్యాన్నిచ్చిన నాగమ్మకు శర్మ చూపదల్చుకున్న కృతజ్ఞత ఎటువంటిది? ఆమె మెళ్ళో మూడు ముళ్ళు వేసి, జీతం లేని పనిమనిషిగా తన సేవకు వినియోగించుకోవాలన్న నీచపు ఎత్తుగడ! సత్యం శర్మను ఛీకొట్టి, ఆ ఆలోచనను తన దగ్గర వ్యక్తం చేసినప్పడు, చెప్పుతో జవాబు చెప్పమని, నాగమ్మకు చెప్పివెళ్ళిపోతాడు.

ఏదో ఒక ప్రయాణానుభవం ఈ కథకు ప్రేరణ అయివుండవచ్చు. కథని అవసరం లేనంతగా పొడిగించినట్టనిపిస్తుంది. మధ్యలో రాజు కుటుంబమూ, పక్షవాతంతో వున్న అతని తల్లీ, ఆమెను ఆస్పత్రిలో చేరుద్దామని సత్యం అంటే, రాజు ఒప్పకోకపోవడం... ఇదంతా ఎందుకు తెచ్చినట్టు? సంపన్నవర్గానికి చెందిన శర్మ, కూతురు తండ్రి ఆరోగ్యం గురించి పట్టించుకోకపోతే, పేదవాడైన రాజు తల్లి విషయంలో ఎంత శ్రద్ధ చూపాడో, చూపడానికి, ఇది కొంత ఆదర్శపంథాలో వుందేమోనినపిస్తుంది. వాస్తవంలో అయితే, స్వల్ప ఆదాయంతో, జానెడు ఇంట్లో భార్యతో కలిసి వున్న రాజుకు, పక్షవాతంతో వున్న తల్లికి వైద్యం చేయించటానికి కానీ, స్థలసౌకర్యానికి కానీ వీలుండదుకదా... అనిపిస్తుంది. అయితే, ఆర్థిక పరిస్థితి గురించి నేను చెప్పలేదు, అనుబంధాల గురించే చెప్పాను... అనవచ్చు *రంగనాయకమ్మ*.

మురళిది ముగ్గరే ముగ్గురున్న ముచ్చటైన... కాదు, చిన్న కుటుంబం, నిజానికి, ముచ్చటైన కుటుంబంగా కూడా వుండవలసిందే కానీ, ఈ మధ్య కొంచెం దారి తప్పినట్టు అనిపిస్తోంది మురళి తల్లి రుక్మిణికి. మురళి భార్య రజని ఈ పరిస్థితిని సహిస్తూ, స్పందనరహితంగా వుండటం కూడా ఆమెకు నచ్చడంలేదు. అస్తమానం ఫోన్లగోల, క్యాంపుల కథనం, ఆ క్యాంపుల్లో లేడీ కొలీగ్‌తో గడపిన కులాసాల, ఖుషీల గోల... అబ్బబ్బ... ఇంటికీ, కంపెనీ ఆఫీసుకీ తేడా లేకుండా పోయింది.

ఎటువంటి మురళి ఎలా అయిపోయాడు, అని ఆలోచిస్తుంది మురళీ వాళ్ళమ్మ. భర్తతో విడిపోయి, కొడుకుతో కలసి అర్థరాత్రి బయటికొచ్చి, కంటికీ మంటికీ 'ఏకధారగా' ఏడ్చిన జ్ఞాపకాలూ, తను కుట్టమిషన్నీ, సంగీతం క్లాసులనూ నడుపుతూంటే, కొడుకు ఒక్కొక్క పరీక్షే దాటుకుంటూ చిన్న ఉద్యోగంలోకి ప్రవేశించిన సంఘటనలూ ఆమె కళ్ళ ముందు తిరుగుతాయి. ఆ చిన్న ఉద్యోగం నుంచీ, విమానాలెక్కి క్యాంపులకూ, టూర్లకూ వెళ్లేంత పెద్ద ఉద్యోగస్తుడయ్యాడు మురళి. అయినా అప్పటికి సంతృప్తీ, శాంతీ వుండటం లేదు. ఈ ఉద్యోగంకంటే, ఏదో ఫ్యాక్టరీలో కార్మికుడిగా వుండినా బావుండేదనిపిస్తోంది తనకు.

కట్టుకున్న వాడికి పెట్టుకున్న ఇంకో సంబంధం వుందని తెలిసాక, ఆ ఇంటినీ, అతణ్ణీ విడిచి వచ్చింది తను. ఇప్పడు మురళి అదే విధంగా వ్యవహరిస్తూంటే, సహించి వుండాలా? దేని కోసం? కొడుకు పెద్ద ఉద్యోగి అనా? అది తనని తాను అవమానించు కోవడమే, తన వల్ల కాదు. అందుకే మురళికి చెప్పేసింది, "ఇక నీదారి నీదీ, నా దారి నాదీ" అని. రజనికి కూడా చెప్పింది. మురళిని అతని ఆనందానికి విడిచి పెట్టి, ఆత్మగౌరవంతో జీవిస్తావో, అతణ్ణి భరిస్తూ ఆత్మాభిమాన రహితంగా బ్రతుకుతావో తేల్చుకో... అని. రజని ఏడుస్తోంది. మురళి అమ్మని భయంగా చూస్తున్నాడు. ఇది 'మురళి వాళ్ళమ్మ' కథ.

మురళి ఏం చెప్పాడో, ఏ నిర్ణయాని కొచ్చాడో తెలీదు. తల్లిని భయంగా చూస్తున్నాడంటేనూ, "ఊరుకో ఏం లేదు". అని రజనిని ఓదారుస్తున్నాడంటేనూ, తల్లి ఇష్ట ప్రకారమే వుండదల్చుకున్నాడా? మురళీ వాళ్ళమ్మలాగా ఎవరి అమ్మయినా వుండటం సాధ్యమేనా? ఆమెకయినా అది సాధ్యమే అయివుంటుందా? బయటి ప్రపంచం వత్తిడిలేని తను బ్రతుకుతున్న పద్ధతిలోనే మురళిని కూడా బ్రతకమనడం మురళి అమ్మకు న్యాయమేనా? ఈ ప్రశ్నలొస్తే, జవాబులు ఆలోచించి చెప్పకోవలసిందే.

బుచ్చిబాబును 'అనితరసాధ్యుడు, అంటుంది విమల. "కాదు సాధ్యుడే" అంటుంది విమల స్నేహితురాలు నిర్మల, ఇద్దరి మధ్యా పందెం ప్రారంభమయింది. కొన్ని ప్రయత్నాలు చేసిన తర్వాత, బుచ్చిబాబు అనితర సాధ్యుడేనని ఒప్పకుని, వసంత్‌ని భర్తగా సాధ్యం చేసుకుంది నిర్మల. ఈ కథని సరదాగా చదవొచ్చు. విమలా, బుచ్చిబాబులు రంగనాయకమ్మకు ఇష్టమైన పాత్రలు. వీళ్ళని గురించి "స్వీట్‌హోమ్" మూడు భాగాలలో చెప్పిన సంగతి తెలిసిందే. ఒక్కో సందర్భంలో బుచ్చిబాబు అమాయకత్వాన్ని నటిస్తున్నట్టు అనిపిస్తుంది. విమలకు బుచ్చిబాబు మీదవున్నది ప్రేమా, లేక ఈ మొద్దావతారం ఈ లోకంలో ఎట్లా బ్రతుకుతాడా అని చూపుతున్న జాలా... అనిపిస్తూంది. అనితర సాధ్యుడు అంటే అదేదో తిట్టులావుంది... అంటాడు బుచ్చిబాబు. అంతకంటే, తమాషాగా ఎగతాళి చేస్తున్నట్టుగా వుందేమో... అనిపిస్తుంది. 'మీటింగ్ పెళ్ళి'ని కూడా సరదాగా చదవచ్చు.

'పెళ్లి చేసేశాం' కథని తమాషాగా చెప్పినట్టు చెప్పినా, కథలో వున్నది విషాదం. కూతురు పిచ్చికి వైద్యం చేయించాలన్న ఆలోచనకంటే, ఆ కూతురుకు పెళ్ళి చేయాలన్న పిచ్చి ఎక్కువైన తలిదండ్రులు, ఆస్తి చూపించి ఓ సంబంధం కుదుర్చుకుంటారు. పెళ్ళిలో, ఆ పిల్ల పిచ్చిదని తెలుసుకున్న పెళ్ళి కొడుకు పీటల మీది నుంచి లేచిపోతే, ఇంకోడొచ్చి ఆ పీటల మీద కూచొని, ఆ పిల్ల తలిదండ్రుల్ని 'పెళ్ళి చేసేశాం' అనుకోనిస్తాడు. "వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యాలి" వంటి నీతులున్న చోట, "ఆస్తివున్న పెళ్ళాం పిచ్చిదైతే మరీ మంచిది" అనుకునేవాళ్ళుండరా?

'ప్రేమ ప్రేమని ప్రేమిస్తుంది' కూడా పెద్ద కథే. ఈ కథలోని కొన్ని వాక్యాలను అక్కడక్కడా తీసేశానన్నారు రంగనాయకమ్మ, ' ఈ కథ గురించి'లో. 'ప్రేమ' అన్న మాటని ఇష్టపడని రంగనాయకమ్మ ఈ మూడు ప్రేమల పేరుని ఎందుకుమార్చలేదా అనిపిస్తుంది. 'ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును' అన్న గురజాడ కవితాత్మక వాక్యం ఈ పేరుకు ప్రేరణ కావచ్చునేమో! చంద్రశేఖర్ అనే చదువుకున్న నిరుద్యోగి ఉద్యోగం చూపిస్తారేమోనన్న ఆశతో, సుధ నాన్నగారి దగ్గరికొస్తాడు. కాలేజీ చదువులో

వున్న సుధ అప్పటికే వాళ్ళ లెక్చరర్ ప్రేమని తిరస్కరించింది. సుధ నాన్న ఉద్యోగం చూపించలేకపోవడంతో చంద్రశేఖర్ వెళ్ళి పోతాడు. నిరంకుశంగా వ్యవహరించే నాన్న పద్ధతికానీ, ఆయనకు భయపడుతూ అణగివుండే అమ్మ పద్ధతి కానీ సుధకు నచ్చదు. తమ ఇంట్లో కొన్నాళ్ళుండి వెళ్ళి పోయిన నిరుద్యోగి చంద్రశేఖర్ ప్రవర్తనా, సంస్కారమూ ఆమెకు నచ్చుతుంది. ఇద్దరూ ఉత్తరాల ద్వారా పరస్పరం ప్రేమని ఇచ్చి, పుచ్చుకుంటారు.

ఈ విధంగా కథ చెప్పి, రచన ఇదేననడం రచయితకు న్యాయం చేయడం అవదు కానీ, గత్యంతరంలేదు. ఈ కథారచన నాటికి రంగనాయకమ్మ రచయితగా ఇటు ప్రాథమికదశకూ, అటు పరిణతదశకూ మధ్యంతరంగా వుండినట్లు, అనిపిస్తుంది. పాత్రల సంభాషణల్లోని కొన్ని వాక్యాలను తొలగించానని ఆమె కూడా చెప్పారు. అయినా, పాత్రలు జ్ఞాన ప్రదర్శన పట్ల ఉత్సాహం చూపడం ఇంకా కనిపిస్తోంది.

'బూడిదలో పన్నీరు పోసినట్లు' అనేది ఒక తెలుగు నుడికారం. 'అడవిలో వెన్నెల కాసినట్లు' అనేది కూడా అటువంటి అర్థమున్ననుడికారమే. ఈ రెండిటికీ 'వృథా' అనే అర్థసామ్యమున్నప్పటికీ, తేడాలు కూడా వున్నాయి. మొదటిది మనిషి చేసిన పనికిరాని పనిని చూచిస్తే, రెండోది అనివార్యమైన ప్రకృతి నియమాన్ని తెలియజేసేది. అడవిలో కాసిన వెన్నెల వృథా అని వెన్నెల కానీ, అడవికానీ అనుకున్నది కాదు. తన అనుభవానికి రానిది వ్యర్థం అనుకునే స్వార్థపరుడైన మనిషి అన్నది. అది అడవి అని తెలిసినా, వెన్నెల కాయకుండా మానుకోదు. పైగా అడవిలోనే వెన్నెల అందంగా వుంటుంది. తెలిసి తెలిసి మనుషులెవరూ బూడిదలో పన్నీరు పోయరు, పిచ్చివాళ్ళయితే తప్ప. పన్నీరు పోసాక, అది బూడిద అని తెలుసుకోవచ్చు. అప్పటికి, పన్నీరు వృథా అయింది, కన్నీరైనా వృథా చేసుకోకూడదని గ్రహిస్తారు.

'బూడిదలో పన్నీరు' కథలో సుశీల గ్రహించింది దీన్నే. ప్రేమ, కవిత్వం రాసే సుధాకర్ హృదయంలో కూడా ప్రేమవుంటుందని నమ్మి, అతనికి తన ఆరాధనని తెలియజేసే ప్రేమలేఖ రాసింది. అతను దాన్ని తనకున్న 'హీరో వర్షిప్'ను చాటుకునేందుకు ప్రచారంలో పెట్టాడు. సుశీల అవమానాలపాలై, బాధపడింది. తాను బూడిదలో పన్నీరు పోసినట్లు తెలిసాక, ఆ బూడిదను కాలితో తన్నేసింది. అంటే, ఆ ఉత్తరాన్ని సుధాకర్ తిరిగి ఇవ్వబోతే "అక్కర్లేదు, ఇంకా చూపించని వాళ్ళకు చూపించుకో" అనగలిగింది.

ఈ కథ చదివాక, ఒక సందేహం వస్తుంది. సుధాకర్‌తో సుశీలకు పరిచయం లేదు. పరిచయం లేని సుధాకర్ ప్రేమ కవిత్వం చూసి, సుశీలవంటి ఆత్మాభిమానం వున్న అమ్మాయి, నేరుగా ప్రేమలేఖ రాస్తుందా? అందునా, అంత పిచ్చి ప్రేమను వ్యక్తం చేస్తూ! వ్యక్తిగతంగా పరిచయం లేకపోయినా, కళ్ళతో చూస్తున్న వ్యక్తుల్ని ప్రేమించే సందర్భాలుంటాయి. చాలావరకూ అవి ప్రచ్ఛన్నప్రేమలుగానే వుంటాయి. ఇక్కడ బూడిదలో పన్నీరు పోయాలికనుక, సుశీల ప్రేమలేఖ రాసినట్లు చెప్పారు. అనుకుంటే తప్పవుతుందా? అయితే, ఈ కథలో కూడా రచయితగా రంగనాయకమ్మ పరిణతిని సూచించే అంశం ఒకటుంది. సాధారణ రచయితలైతే, సుధాకర్ మీ ప్రేమకు అర్హుడు కాదని తెలియజేసిన రామారావు పైకి సుశీల ప్రేమ మళ్ళినట్లు చెప్పేవారు. ఆ విధంగా చేసి, పాఠకులకు కొంత సంతృప్తిని కలిగించాలని ఆలోచించేవాళ్ళు. అలా ఆలోచించకపోవడంలో రంగనాయకమ్మ వున్నారు.

'సరికొత్త మనుషులు' సమాజంలో ఇప్పటికీ పాతమనుషులు కాకపోవటం విచారకరం. అంటే, ఇప్పటికీ ఆ కథలో మనుషులు ఆలోచించినట్టుగా, సమాజంలో ఎక్కువమంది ఆలోచించలేకపోవడం విచారకరమని. ఇప్పటికీ, భార్యలకు ఏ మగవాళ్ళతోనో సంబంధాలున్నాయన్న అనుమానంతో అమానుషంగా భార్యలను నరికో, పొడిచో, చంపే భర్తలు కనిపిస్తూవుండటం, విచారానికీ, విషాదానికీ మించిన ఘోరం. రాజారావూ, శ్యామలా కొత్త దంపతులు. కొత్త దంపతుల కుండవలసిన ఉత్సాహం శ్యామలలో కనిపించకపోవడంతో, ఆరోగ్యం బాగా లేదేమోనని, డాక్టర్ రఘునాథ్ దగ్గరికి భార్యను తోడ్కొనివచ్చాడు రాజారావు.

శ్యామల గర్భవతి అని గ్రహించిన రఘునాథ్, పెళ్ళికి ముందు శ్యామల మోసపోయిందో, పొరపాటు పడిందో దాన్ని మరచిపోయి, 'అబార్షన్' చేయించి, కొత్త జీవితం ప్రారంభించమని, రాజారావుకు సలహా ఇస్తాడు. అందుకు గట్టిగా తిరస్కరించి, శ్యామల మీదా, డాక్టర్ మీదా ఆగ్రహించిన రాజారావు వెళ్ళిపోతాడు. శ్యామల గర్భవతి అన్న సంగతి రాజారావుకు చెప్పి పొరపాటు చేశానని రఘునాథ్ పశ్చాతాపపడుతూ వుంటాడు. అయితే, అతనికి ఆశ్చర్యం కలిగే విధంగా, తిరిగి భార్యతో కలసివచ్చిన రాజారావు, శ్యామలకు 'అబార్షన్' చెయ్యవలసిన అవసరం లేదనీ, పుట్టినబిడ్డను పెంచుకుంటామనీ, ఆమె ఆరోగ్యంగా వుండేందుకు మందులు రాసివ్వమనీ... అంటాడు. డాక్టర్ రాజారావును అభినందిస్తాడు.

కథ అంతటితో అయిపోలేదు. శ్యామలా, రాజారావుల సంగతి భార్య సుజాతకు చెబుతాడు రఘునాథ్, అప్పుడు సుజాత దాచిన తనగతం చెబుతుంది. శ్యామల గర్భవతి మాత్రమే అయితే, సుజాత పెళ్ళికి ముందు కొడుకును కూడా కన్నది. ఆ కొడుకు ఇప్పుడు ఏదో హోమ్‌లో పెరుగుతున్నాడు. ఈ గతం రఘునాథ్‌కు చెప్పలేకపోయింది. ఇప్పుడు రఘునాథ్ చెప్పిన విషయం విన్నాక, అతని సంస్కారం తెలిసాక, చెప్పడానికి సాహసించింది. రఘునాథ్ మొదట సర్దుబాటు చేసుకోలేకపోతాడు. రాజారావుకు తాను చేసిన హితబోధ జ్ఞాపకం వస్తుంది. ఇతరులకు చెప్పినదాన్ని తాను ఆచరించడా? సుజాతతో కలిసి, ఆ హోమ్‌కు వెళ్ళి ఆమె కన్న కొడుకును తీసుకుని వచ్చేస్తాడు.

ఈ కథ గురించి రంగనాయకమ్మ చెప్పిందంతా, రాజారావుతో రఘునాథ్ చెప్పిన మాటల్లో తప్పవుందనే, అది గాక కథాపరంగా అనవసరమైన మెలికవుంది. శ్యామలకు 'అబార్షన్' అవసరం లేదనీ, పుట్టిన బిడ్డను తాము పెంచుకుంటామనీ రాజారావు అనడంతో కథ ముగిస్తే, కథకేమైనా లోపం వచ్చేదా? సుజాతకూ అటువంటి గత ముందని చెప్పడంవల్ల కథకు అదనంగా వచ్చిన ప్రయోజనమేదీ లేకపోగా, ఏదో కథావసరంగా భావించి చెప్పినట్టు, కనిపిస్తోంది. సుజాతకు భర్తను గురించి అప్పటివరకూ తెలియకుండానే వుండిపోయిందా, అన్న అనుమానం వచ్చేవిధంగా వుంది. అంతకన్నా కూడా తప్పవుంది. భర్తలు సంస్కారవంతులూ, సరికొత్త మనుషులూ అని చెప్పేందుకు, భార్యలు పెళ్ళికి ముందే సంబంధాలు పెట్టుకుని వుండాలా? ఈ ప్రశ్న రంగనాయకమ్మకు ఎందుకు రాలేదా... అన్న ఆశ్చర్యం కలుగుతుంది.

'స్త్రీ' అన్నపేరిట నవల రాసిన రంగనాయకమ్మ, అదే పేరుతో కథ కూడా రాశారు. అయితే, ఆ స్త్రీ వేరూ, ఈ స్త్రీవేరూ, రుక్మిణత్తను జ్ఞాపకం చేసుకున్నప్పుడు, విజయకు ఒక్కోసారి ఆమె మీద జాలీ కలుగుతుంది. మరోసారి అసహ్యమూ కలుగుతుంది. రుక్మిణత్త ఒక రకంగా సుమతి లాంటిది. మరొకరకంగా సుమతికాదు కాదా, మతిలేనిది, భర్త కన్నుపడిన ఆడమనిషిని సమకూర్చడమే ఆమెపని. ఆ పని నవ్వుతూ నవ్వుతూ చేస్తుంది. రుక్మిణత్త అలాంటి పని ఎందుకు చేసేదో విజయకు తెలియనట్టే, ఆ కథ రాసినప్పటికి రంగనాయకమ్మకూ తెలియదు. ఆ తర్వాత తెలిసింది. ఏమని? "మొగళ్ళు ఏం చేసినా, ఎవరితో తిరిగినా తప్పలేదు. పేద ఆడవాళ్ళు ఎలాగూ నీతిమంతులుగా వుండరు. అలాంటి ఆడవాళ్ళు మన మొగాళ్ళకి దొరికితే వాళ్ళ నివదులుకోవడం ఎందుకు? ఇవీ వాళ్ళ అభిప్రాయాలు" అని. అయితే పూర్తిగా ఇది వర్గస్వభావానికి సంబంధించిందే కాకపోవచ్చు. అణచబడిన కోర్కెలకు సంబంధించింది కూడా కావచ్చు. 'బ్లూఫిల్ములు' చూడటం వంటిది కావచ్చు.

'నిన్నా-నేడు -రేపూ' అంటే, అన్నపూర్ణ మామ, భర్త, కొడుకులకు సూచిక. భర్త రామారావు పనిమనిషి రంగకేసి చూస్తున్నాడని ఆమెను మాన్పించి, యాభైఏళ్ళకు పైబడిన అప్పలమ్మను కుదుర్చుకుంటుంది అన్నపూర్ణ. ఇప్పుడు అప్పలమ్మ వైపే కళ్ళు అప్పజెబుతున్న ముసలాయన గొడవ. ఆమెనూ మాన్పించి, పన్నెండేళ్ళ పిల్ల రమణను తెచ్చుకుంటే, పెద్ద కొడుకు బెడద! అప్పుడు "రంగ నిప్పలాంటి మనిషి, నా మొగుడిబుద్ధి చెడితే, దాని బుద్ధి చెడుతుందా" అనుకొని, మళ్ళీ రంగను నియమించుకుంటుంది. అంతేతప్ప, తను ఊరికే ముసలాయన్నూ, అప్పలమ్మనూ, రమణనూ, తన కొడుకునూ

అనుమానపు కళ్ళతో చూసినట్టు గ్రహించదు. మగవాళ్ళనిలా కట్టగట్టి నిందించే వీర ఫెమినిస్టుగా వుండిందా రంగనాయకమ్మ... అనిపిస్తుంది ఈ కథ.

ఇంతకు ముందే చెప్పకున్న రుక్మిణత్తకు పూర్తి వ్యతిరేకం ఈ అన్నపూర్ణ. ఆమె మొగుడు కోరిన ఆడవాళ్ళను సమకూరిస్తే, ఈమె వయస్సుతో నిమిత్తం లేకుండా మగవాళ్ళందరూ ఒకటేననుకుంటుంది. "ఒక రచయిత ఒకే విషయం మీద వేరు వేరు కాలాల్లో వేరు వేరు రకాలుగా చెప్పివుంటే, అందులో చివరిదాన్ని ఆ రచయిత అభిప్రాయంగా తీసుకోవాలి" అని ముందుమాటలో అన్నారు రంగనాయకమ్మ, ఆ మాట ప్రకారం 'స్త్రీ' తర్వాతది 'నిన్నా-నేడు-రేపు' కనుక, రంగనాయకమ్మ అటువంటి ఫెమినిస్టుగా వుండిందా... అనడం.

'అమ్మ' కథ ఇప్పటికీ జ్ఞాపకమున్న మంచి కథ. సమాజంలో వున్న విలువలకూ, విశ్వాసాలకూ... అనుకోకుండా జరిగే సంఘటనలకూ, వాస్తవాలకూ మధ్య నలిగే మనస్సులకు సంబంధించిన సున్నితమైన స్పందనల్ని చూపించిన మానవీయమైన కథ. త్వరలో తనకు తమ్ముడో, చెల్లెలో రాబోతున్నట్టు, భార్య యమునద్వారా తెలుసుకున్నరావు దిగ్భ్రాంతి చెందాడు. తమ కొడుకు పుట్టిన తర్వాత, యాభైఏళ్ళకి దగ్గరవుతున్న అమ్మకూ, అరవైఏళ్ళకి దగ్గరవుతున్న నాన్నకూ పిల్లలా? ఛీ... ఎంత అసహ్యం ... ఎంత సిగ్గులేనితనం! ఎంత బాధ్యతారాహిత్యం! అలా అని, నేరుగా వాళ్ళనేమనాలో తెలీదు. కన్నతల్లినీ, తండ్రినీ "ఇలా చేసారేమిటి?" అని ఎలా అడుగుతాడు? అంతకు ముందులాగే వాళ్ళ మొహం ఎలా చూస్తాడు? భార్య యమునకు ఒక వైపు అత్తమీద సానుభూతీ వుంది, మరోవైపు కొంత తమాషాగానూ వుంది.

అమ్మ మాత్రం ఆ సంగతి తెలిసినప్పట్నించీ, కొడుకు మొహమూ, భర్త మొహమూ చూడలేకపోవడమే కాదు, తన మొహం కూడా ఎవరికీ చూపించకుండా గదిలోనే వుండిపోయింది. ఆహార, ఆరోగ్యాలపట్ల అనాసక్తి. ఎవరెలాగున్నా కాలమాగదుకదా! అమ్మ తాజాగా 'అమ్మ' అయింది. రావుకు తమ్ముడు పుట్టాడు. అంతవరకూ అతను అమ్మ మొహం చూడకుండా, ఆమె కంటపడకుండా తప్పించుకునే తిరిగాడు. తమ్ముణ్ణి గురించి, భార్యా చెల్లెలూ చెప్పకుంటూ వుంటే, చాటుగా తొంగి చూసాడు. చెంపలు నెరసి, బుగ్గలు గుంటలు పడి, నీరసంతో వున్న అమ్మ. అయినా, అమ్మ మొహంలో ఏదో ఆనందం, ఎంతో అందం! పాతికేళ్ళ క్రితం అమ్మతననిలాగే ఒడిలో పడుకోబెట్టుకుని వుంటుంది. అలా అనుకుంటూంటే, అమ్మ పట్ల తనెంత అపరాధం చేసాడో అర్థమయింది. అప్పుడు అమ్మను పలకరించి, తమ్ముణ్ణి ఎత్తుకున్నాడు. "నీకు బాబాయి పుట్టాడురా" అని కొడుక్కు చెప్పాడు. రంగనాయకమ్మ రాసిన మంచి కథల్లో ఇదొకటి.

'అనుభవం', 'తెరవెనుక' కథలు రంగనాయకమ్మ 'ప్రజాసాహితి'కి సంపాదకత్వం వహించినప్పటివి. మొదటిది ఉద్యమ ప్రవేశానికి నేపథ్యంగా వుంటే, రెండోది ఉద్యమ నిబద్ధతను సూచించేది. మూడు దశాబ్దాల క్రితం 'తెరవెనుక' వున్న కథ ఇప్పుడు తెరముందుకు రావడమేకాక, వీధి నాటకంగా కూడా ప్రదర్శితమవుతోంది. అదే 'ఎన్‌కౌంటర్' పేరుతో నక్సలైట్లనూ, నక్సలైట్లకు సహకరిస్తున్నారని అమాయకులనూ కాల్చి చంపటం. ఎన్‌కౌంటర్ల విషయంలో రంగనాయకమ్మ దృక్పథంలో అప్పటికీ ఇప్పటికీ మార్పు రానప్పటికీ, నక్సలైట్ల విషయంలో 'తెరవెనుక' కథ రాసినప్పటికీ, ఇప్పటికీ మార్పు వచ్చినట్టు, ఆమె ఇటీవలి అభిప్రాయాలు తెలియజేస్తున్నాయి.

'కుట్ర' కథ వచ్చినప్పుడు, సంచలనం కలిగింది. సహజంగానే, ఉద్యమాలలో వున్నవాళ్ళూ, సానుభూతిపరులూ ఆమెను తీవ్రంగా విమర్శించగా, కొద్దిమంది ఆమె చెప్పిన విషయంతో ఏకీభవించిన వాళ్ళూ వున్నారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదొయ్యాలని కుట్రపన్నారంటూ కొందరు విప్లవకారులపై పోలీసులు కేసు పెట్టారు. 'ప్రజలమనిషి'గా పేరు పొందిన న్యాయమూర్తి ఆ కేసును కొట్టేశారు. అయితే, విప్లవకారులకు పదేళ్ళ జైలు శిక్ష విధించారు. ఎందుకు? విప్లవకారుల సాహిత్యంలో, పత్రికల్లో, కరపత్రాల్లో, ఆఖరుకు నినాదాల్లో కూడా ప్రజలకే మాత్రం అర్థం కాని రాతలురాస్తున్నందుకు. జడ్జి అలాంటి రాతల్ని చదివి వినిపించారు. ఆ విధంగా ప్రజలకు అర్థంకాని రాతలు రాయడం ద్వారా, విప్లవం గురించి

ప్రజలకు తెలియనీకుండా వుండే కుట్రపన్నారు కనుక, మీకీ శిక్ష విధిస్తున్నాననీ, జైల్లోనయినా మంచి సాహిత్యం చదివి, తెలుగు నేర్చుకురమ్మనీ, జడ్జి హితవు చెప్పారు.

ఇక్కడ జడ్జి ఎవరో కాదు, రంగనాయకమ్మే. "మంచిని కోరేవాళ్ళు కఠినంగానూ, నిర్మొహమాటంగానూ ప్రవర్తిస్తారు" అని జడ్జి, అంటే, రంగనాయకమ్మ అన్నమాట నిజమే కానీ, వ్యతిరేకత వుందన్నంతగా ప్రవర్తించరు. "జనం కూడా విప్లవకారుల మీద కోపంతో ఊగిపోయారు" వంటి వర్ణన వ్యతిరేకతను సూచించడం కాదా? ఆమాటకొస్తే, భాషకు సంబంధించిన లోపాల కంటే, జనం ఉద్యమకారుల ఆచరణను బట్టి అందుకనుగుణంగా స్పందిస్తారు కదా!

అయితే, భాష తేలిగ్గా వుండి, అన్వయదోషాలూ కాఠిన్యమూ లేకుండా వుంటే చదువు వచ్చినవాళ్ళూ, కొంచెం కొంచెం వచ్చినవాళ్ళూ, అసలురానివాళ్లూ కూడా అందులో వున్న అర్థాన్ని గ్రహించి, తదనుగుణంగా స్పందించే అవకాశముంది. అర్థమేగాకపోతే, స్పందన ఏముంటుంది? ఇంతవరకూ తీసుకుంటే రంగనాయకమ్మ చెప్పిన దానిలో ఎటువంటి తప్పూలేదు. మొదటితరం కమ్యూనిస్టులు... ఉదాహరణకు పుచ్చల పల్లి సుందరయ్య, చంద్రరాజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి తదితరులు తెలుగు సాహిత్యం బాగా చదివినవాళ్ళే, వాళ్ళు రాసిన వ్యాసాలలో 'మంచి తెలుగు' వుండి, చదివిన వాళ్ళకు తేలిగ్గా అర్థమయ్యేది. తెలంగాణా సాయుధ పోరాటకాలంలోనూ, ఆ స్ఫూర్తితో వచ్చిన సాహిత్యంలోనూ ప్రజలకర్థం కాని భాషలేదు.అందువల్ల ఉద్యమ సాహిత్యం ప్రజలకు అర్థమయ్యేదిగా వుండాలనడం చాలా సరైన అభిప్రాయం. ఆ సరైన అభిప్రాయాన్ని సరైన పద్ధతిలో చెప్పివుంటే 'కుట్ర' కథకు అంత వ్యతిరేకత వచ్చేదికాదు.

ఆ కథని ఆమె సరైన పద్ధతిలో చెప్పలేదన్న సంగతి అర్థం కావటానికి, ఆమె అనుసరించిన నాటకీయ పద్ధతినే అనుసరించి చూద్దాం. అమ్మకు ఆదివారం లేదా? అన్న కథా సంపుటంలో, రంగనాయకమ్మ, కథని 'కధ'గా పేర్కొని, తెలుగు భాషని చెడగొట్టడానికి యత్నించారని, ఒక భాషా పండితుడు ఆమెపై కేసు పెట్టారనుకుందాం. ఆ విచారణ ఎలా వుంటుంది? రంగనాయకమ్మో, ఆమె తరపున వకీలో... కథలో సత్తావుండాలికానీ పొట్టలో చుక్కలేకపోతే ఏమయింది, అని వాదిస్తారు. అలా కుదరదనీ, భాష సరిగాలేదని ఆమె విప్లవకారులకు పదేళ్ళ జైలు శిక్షను విధించారు కనుక, ఆమెకు కొద్దిగానైనా శిక్ష పడాలనీ, కథని 'కధ' అంటే ఉచ్చారణ మారి అర్థమే లేకుండా పోయిందనీ, వ్యావహారికంలో చెప్పినా, కథ 'కత' అవుతుందిగానీ 'కద'కాదు కదా... అనీ, ఆ పండితుడి తరపు వకీలు వాదిస్తాడు. జడ్జి తీర్పు ఏమని ఇస్తారు? 'కథ'ని 'కధ' అనకూడదనుకునేవారైతే, రంగనాయకమ్మకు కొద్దిపాటి శిక్షపడుతుంది. "అంటే ఏమయింది, కొంపమునుగుతుందా?" అనుకునేవారైతే, కేసుకొట్టి వేయబడుతుంది.

ఇలా చెప్పకోవడం, రంగనాయకమ్మ చెప్పిన విషయ ప్రాధాన్యతని తగ్గించడానికీ కాదు, ఆమెను అగౌరవించడానికీ కాదు. కొన్ని సందర్భాల్లో ఆమె రోగానికి మించిన మోతాదులో మందు వాడటం వల్ల వికటించే అవకాశం వుందని సూచించడానికి చెప్పిందే. నిజానికి, భాషని గురించిన ఆమె ఆలోచన 'కుట్ర' కథతోనే ఆగలేదు. పత్రికల్లో వస్తున్న భాషను గురించి ఆలోచించి, 'వాడుక భాషే రాస్తున్నామా?' అన్న పుస్తకం ప్రచురించారు. ప్రాథమిక దశలోనే తెలుగును నిర్దుష్టంగా నేర్పాలంటూ, 'తెలుగు నేర్పడం ఎలా?'గో తెలిపారు. రంగనాయకమ్మ చెప్పిన విషయంతో ఏకీభవించినా, ఏకీభవించకపోయినా, చెప్పిన విషయం అర్థం కాలేదని, ఎవరూ అనలేరు. అంత స్పష్టంగా వుంటుంది ఆమె రచన. ఈ సందర్భంలో అప్రస్తుతం అనుకోరనిభావిస్తూ, భాష విషయంలో 'ఆమె నా గురువు' అని ప్రకటించుకుంటున్నాను.

మొత్తం మీద,ఈ బృహత్తర కథా సంపుటంలో రంగనాయకమ్మ దద్దనాల రంగనాయకమ్మగా వుండిన చిన్నప్పటికథ 'రగిలిన పగ' నుంచీ, ముప్పాళ రంగనాయకమ్మగా వున్న కథలూ, ఇంటిపేరు అవసరమేలేని రంగనాయకమ్మగా రాసిన కథలూ వున్నాయి. వీటన్నిటినీ, ఇంకా ఇందులో రాని కథల్నీ పరిశీలించినప్పుడు, రంగనాయకమ్మ ఇన్ని కథలు రాసారా... అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఆమె తన నవలల్నీ, వ్యాసాల్నీ 'రీప్రింట్' చేయడంలో చూపిన శ్రద్ధ, కథల్ని 'రీప్రింట్'

చేయడంలో చూపినట్టు లేదు. బహుశా, ఎక్కువ కథలు మార్క్సిజం తెలియక ముందు రాసినవి కనుక, వాటిని 'రీప్రింట్'కి తేవాలని అనుకోలేదేమో... అనిపిస్తుంది. ఆమెకు సంబంధించిన కారణం ఇదైతే, తెలుగు సాహిత్య ప్రపంచానికి సంబంధించిన కారణం ఇంకోటుంది.

ఆమెను కథా రచయితగా, తెలుగు సాహితీ లోకం మరచిపోయిందో, మరచి పోయినట్టు నటిస్తోందో, తెలీదు. ఏదో కారణం చేత ఆమెను రచయితగానే గుర్తించదల్చుకోని వాళ్ళను అటుండనిస్తే, తెలుగులో ఎన్నో కథా సంకలనాలు వెలువడుతున్నాయి. సంస్థలూ, వ్యక్తులూ సంకలనాలను తెస్తున్నారు. ఇప్పటికీ 'దిద్దుబాటు'తో ప్రారంభించి, ఏ దిద్దుబాటూ లేక ఎన్నో కథలతో వస్తున్న సంకలనాల సందడి కనిపిస్తూనే వుంది. వాటిల్లో రంగనాయకమ్మ కథే కనిపించడం లేదు. కొందరు రచయితలు మాత్రం వివిధ కథా సంకలనాల్లో దర్శనమిస్తూ, 'నన్ను వదిలినీవు పోలేవులే' అంటున్నారు. ఇటువంటి పరిస్థితి వుండటం వల్ల, రంగనాయకమ్మ కథలు మరుగై పోయే ప్రమాదం వుండింది. ఇప్పడిన్ని కథలతో ఈ కథా సంపుటం రావటం, అదీ తక్కువ ధరకే అందించడం ఆహ్వానించి అభినందించవలసిన విషయం.

సంపుటంలోని అన్ని కథల్నీ ప్రస్తావించడం సాధ్యం కాదన్నది తెలిసిందే. దాన్నలావుండనిస్తే, ఈ సంపుటంలో వున్న కథల క్రమం గురించి కొంత ఆలోచించవలసి వుంది. సాధారణంగా రచయితలు, తాము మొదట రాసిన కథల్ని పుస్తకంలో ముందుగా వచ్చేట్టుగానూ, తర్వాత తర్వాత రాస్తూవచ్చిన వాటిని చివరగానూ వచ్చేట్టు పుస్తకాలను తెస్తారు. అందువల్ల తమ క్రమ పరిణామాన్ని తెలుసుకోవడంతో పాటు, ఆసక్తి కరంగా చదివించే అవకాశం వుంటుందని భావిస్తారు. ఈ సంపుటం అందుకు వ్యతిరేకంగా వుంది. ఆమె ఇటీవల రాసిన కథలు మొదటగానూ, నలభై, యాభై ఏళ్ళ క్రిందటరాసిన కథలు పోనుపోనూ వున్నాయి. మొట్ట మొదట రాసిన కథ 'పార్వతమ్మ' చిట్టచివర వుంది. ఇన్ని పేజీల పుస్తకంలో, ఆ విధంగా వుండటం వల్ల, అసౌకర్యంగా వుంటుందన్న సంగతి రంగనాయకమ్మకు తెలియదా?

ఆ కథల్లో చాలా లోపాలున్నాయని చెప్పిన ఆమెకు ఆ సంగతి తెలీకుండా ఎలా వుంటుంది? అంటే, పాఠకులను ఆసక్తికరంగా చదివించడం కన్నా, తన ఆలోచనా పరిణతిని చాటుకుని పాఠకులను ఆశ్చర్యపరచడం కన్నా, వాళ్ళలో సరైన ఆలోచనని కలిగించడమే, ఆమె లక్ష్యమనుకోవాలి. "పాఠకులు తప్పొప్పులు గ్రహించడమే" ఆమెకు కావాలి. "పాఠకుల అమాయకత్వం మీదా, అజ్ఞానం మీదా ఆధారపడినపేరు" చూసుకొని సంతృప్తిపడాలని ఆమె అనుకోవడం లేదు. ఇంతకూ రంగనాయకమ్మ అంటే ఏమిటి?

ఎంత అప్రియమైన విషయం చెప్పాలన్నా వెనుతీయని ఒక సాహసం. ఏ విషయం చెప్పాలన్నా శ్రమించకుండా చెప్పని ఒక అధ్యయనం. 'పెట్టుబడి'ని పరిచయం చేసినా, ఇంగ్లీషు గ్రామర్ చెప్పినా, అంబేద్కర్ గురించి చెప్పినా, ఓ కథో, ఉత్తరమో రాసినా... 'రంగనాయకమ్మతనం' అందులో వుండి తీరుతుంది. రంగనాయకమ్మను, రంగనాయకమ్మతనం లేకుండా చూడలేము. అంత అద్వైతంగా వుండటం, అరుదైన విశేషమని వేరే  చెప్పాలా.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్ వారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.